అంబరాన్నంటిన హోలీ సంబురాలు

నియోజకవర్గవ్యాప్తంగా వేడుకలు

నియోజకవర్గవ్యాప్తంగా సోమవారం హోలీ పండుగ వేడుకలు అంబరాన్నంటాయి. ఉదయం నుంచే చిన్నాపెద్దా తేడా లేకుండా సంబురాలు మొదలుపెట్టారు. గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీల్లో ఒకరిపై మరొకరు రంగులు చల్లుకున్నారు. పలుచోట్ల డీజే సౌండ్‌లు ఏర్పాటు చేసి నృత్యాలు చేశారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన వేడుకల్లో కార్పొరేటర్లు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. పండుగ నేపథ్యంలో పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. -రాజేంద్రనగర్ జోన్ బృందం


నార్సింగిలో కౌన్సిలర్ లక్ష్మీ ప్రవళిక కిరణ్, ప్రజలు..


పుప్పాలగూడలో కౌన్సిలర్ పురుషోత్తం, యాదయ్య


అలకాపూర్ టౌన్‌షిప్‌లో హోలీ వేడుకల్లో పాల్గొన్న ప్రజలు


హోలీ వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ కుటుంబసభ్యులు


నార్సింగిలో..


పుప్పాలగూడ లక్ష్మీనరసింహనగర్‌లో కామదహనం


మణికొండలో పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, బీజేపీ నాయకుడు అంజన్‌కుమార్‌గౌడ్


నార్సింగిలో పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేశ్‌యాదవ్, ప్రజలు


అత్తాపూర్‌లోని మేధా రిజాయిస్ గేటెడ్ కమ్యూనిటీలో హోలీ వేడుకలు


జీహెచ్‌ఎంసీ పారిశుధ్య సిబ్బందితో కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి


మణికొండ తిరుమలహిల్స్‌లో పాల్గొన్న పిల్లలు


కిస్మత్‌పూర్ వేడుకల్లో చిన్నారులు


ఓంనగర్ కాలనీలో కాముడి దహనంలో సురేశ్‌గౌడ్ తదితరులు


బండ్లగూడ జాగీరులో పాల్గొన్న ప్రేమ్‌కుమార్‌గౌడ్

బెల్టు షాపులపై దాడులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెండు బెల్టు షాపులపై ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేశారు. హోలీ పండుగ సందర్భంగా ప్రభుత్వం మద్యం దుకాణాలను మూసి వేసింది. అయినా నిర్వాహకులు మద్యాన్ని విక్రయించారు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేసి 31 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు.

నేడు హెచ్‌సీయూలో ప్రత్యేక ఉపన్యాసం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ గోల్డెన్ జూబ్లీ అండ్ ఎస్‌ఎంఎస్ సిల్వర్ జూబ్లీ విశిష్ట ఉపన్యాస శ్రేణిలో భాగంగా ప్రత్యేక లెక్చర్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.మంగళవారం ఉదయం 11 గంటలకు హెచ్‌సీయూలోని డాక్టర్ జాకీర్ హుస్సేన్ లెక్చర్‌హాల్ కాంప్లెక్స్‌లో 'స్ట్రాంగ్ ఎట్ సస్టేనబుల్: ఇండియాస్ మార్చ్ టు ది థర్డ్ లార్జెస్ట్ ఎకానమీ' అనే అంశంపై సైయింట్ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి ప్రసంగిస్తారు.

ఎస్‌ఎం ఫసియుల్లాకు పీహెచ్‌డీ



రాయదుర్గం: మనూ పరిశోధక విద్యార్థి ఎస్‌ఎం ఫసియుల్లాకు పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. ఆయన ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఇంగ్లిష్ విభాగంలో పరిశోధక విద్యార్థి. ప్రొఫెసర్ సయ్యద్ మహ్మద్ హసీబుద్దీన్ ఖ్వాద్రీ పర్యవేక్షణ, సహ పర్యవేక్షకులుగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గోవిందయ్య గొడవర్తి ఆధ్వర్యంలో 'మ్యాపింగ్ హైదరాబాద్ ఇన్ ఫిక్షన్-ఏ స్టడీ ఆఫ్ సెలెక్ట్ నావెల్స్' అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్ సమర్పించారు.

హెచ్‌సీయూను సందర్శించిన మైసూర్ బృందం


మాట్లాడుతున్న దార్ల వెంకటేశ్వరరావు, చిత్రంలో సీఐఐఎల్ బృందం

రాయదుర్గం: మైసూర్‌లోని భారతీయ భాషా సంస్థలో శిక్షణ పొందుతున్న పరిశోధకులు, అధ్యాపకులు సోమవారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ తెలుగుశాఖను సందర్శించారు. అంతరిస్తున్న భాషలు, మాతృభాషల అధ్యయన సంస్థ(సీఈఎల్ అండ్ ఎంటీఎస్)ను కూడా వారు సందర్శించారు. ఆరుగురు సభ్యులతో కూడిన ఈ బృందానికి డాక్టర్ మిరియాల సత్యనారాయణ నాయకత్వం వహించారు. తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచా ర్య దార్ల వెంకటేశ్వరరావు, సీఈఎల్ అండ్ ఎంటీఎస్ శాఖ అధ్యక్షుడు పమ్మి పవన్‌కుమా ర్, తెలుగుశాఖ అధ్యాపకులు ఆచార్యులు గోనానాయక్, వారిజారాణి, వంగరి త్రివేణి, భుజంగరెడ్డి, విజయ్‌కుమార్, భూక్యా బాలకృష్ణలత తదితరులను ఈ బృందం కలిసింది. ఈ బృందంలో ప్రేమ, సంతోష్, కవిత, దక్షిణామూర్తి, సి బసవరాజు, కుముద ఉన్నారు.

నాటక రంగాన్ని కాపాడుకుందాం

గన్‌ఫౌండ్రీ: ప్రస్తుత సమాజంలో అంతరించిపోతున్న నాటక రంగాన్ని కాపాడుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రసరంజని 31వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మూడు రోజుల పాటు రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న నాటకోత్సవాలను సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అభ్యుదయ నట సమైక్య సమర్పణలు తులసి బాలకృష్ణ దర్శకత్వం వహించిన నివురు నాటకాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ దీపికారెడ్డి, ఆంధ్ర నాటక కళాపరిషత్ అధ్యక్షుడు బి.కృష్ణయ్య, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, రంగస్థల నటుడు దుగ్గిరాల సోమేశ్వర్‌రావు, సినీ రచయిత బుర్రా సాయిమాధవ్, రసరంజని పాల్గొన్నారు.

'థెరానోస్టిక్ అప్లికేషన్స్' పుస్తకావిష్కరణ

రాయదుర్గం: హెచ్‌సీయూ, యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీలోని ఇద్దరు ఫ్యాకల్టీ ప్రతినిధులు ఎడిట్ చేసిన పుస్తకాన్ని స్ప్రింగర్ సింగపూర్ సంస్థ ప్రచురించింది. ఈ పుస్తకాన్ని హెచ్‌సీయూలోని సెంటర్ ఫర్ న్యూరల్ అండ్ కాగ్నిటివ్ సైన్సెస్ స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు చెందిన డాక్టర్ ఆకాష్‌గౌతమ్, యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీలోని ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన డాక్టర్ విశాల్ చౌదరి ఎడిట్ చేశారు. న్యూరోలాజికల్ డిజార్డర్స్‌లో నానో టెక్నాలజీకి సంబంధించిన 'థెరానోస్టిక్ అప్లికేషన్స్' పేరుతో ఈ పుస్తకాన్ని రాశారు. ఈ పుస్తకం నరాల సంబంధిత రుగ్మతల చికిత్స, నిర్ధారణకు నానో టెక్నాలజీ అప్లికేషన్‌లను వివరిస్తుంది.

అతిపెద్ద డిజిటల్ ఎకానమీ భారతదేశానిది

చేవెళ్ల లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

రాయదుర్గం: ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ ఎకానమీ భారతదేశానిదని బీజేపీ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హిల్‌రిడ్జ్ విల్లాస్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో డిజిటల్ ఎకానమీ అంటే సాధారణ ప్రజానీకానికి ఏం తెలుస్తుందని హేళన చేశారన్నారు. నేడు పట్టణ ప్రాంతాలలోనే కాకుండా గ్రామీణ ప్రాంతాలలోనూ డిజిటల్ ఎకానమీ యూజ్ చేస్తున్నారన్నారు. ఏదైనా పని మొదలు పెట్టేటప్పుడు సంకల్పం ముఖ్యమన్నారు. ఆ సంకల్ప బలం ప్రధానమంత్రి నరేంద్రమోడీలో పుష్కలంగా ఉందన్నారు. అదే నేడు దేశాన్ని ముందుకు నడిపిస్తోందన్నారు. కొవిడ్ మహమ్మారి ఆర్థిక సంక్షోభంతో ప్రపంచం విలవిల్లాడిపోయిందన్నారు, అయినా భారతదేశం స్థిరంగా ఉందన్నారు. అది మోడీ నాయకత్వానికి నిదర్శనమన్నారు. కోట్ల మంది భారతీయుల రామమందిరం కల మోడీ హయాంలో సాకారమైందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విల్లా వాసులు పాల్గొన్నారు.

కాలేయ వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయి

మాదాపూర్: దక్షిణ భారతదేశంలో రోజురోజుకి కాలేయ వ్యాధులు గణనీయంగా పెరుగుతున్నాయని యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని యశోద హస్పిటల్‌లో సోమవారం (లివర్ సమస్యలపై) బ్రిడ్జి ది గ్యాప్స్ లివర్ చాప్టర్ నేషనల్ కాన్ఫరెన్స్ , లైవ్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలేయ వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయన్నారు. వైరల్ హెపటిస్, ఫ్యాటీ లివర్, లివర్ ఫైబ్రోసిస్, లివర్ సిర్రోసిస్, లివర్ క్యాన్సర్‌ల వరకు అనేక రకాల కారణాలను తెలుసుకోవచ్చన్నారు. భారతదేశంలో కాలేయ సంబంధిత మరణాలు సంవత్సరానికి 268.580(మొత్తం మరణాలలో 3.17శాతం)కి చేరుకున్నాయని తెలిపారు. లివర్ సమస్య రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.


హిమాయత్‌సాగర్ జలాశయం

బండ్లగూడలో నీటి కటకట..!

- కార్పొరేషన్‌లో తీవ్రమవుతున్న సమస్య
- ఎండిపోయిన చెరువులు, కుంటలు
- అడుగంటిన భూగర్భజలాలు
- వట్టిపోయిన బోర్లు
- పక్కనే హిమయత్‌సాగర్ జలాశయం.. అయినా అందని వాటర్
- ఇబ్బందుల్లో ప్రజలు

బండ్లగూడ: గండిపేట మండలం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొన్నది. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో పలు అపార్ట్‌మెంట్లు, గృహాల్లోని బోర్లు వట్టిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ఆయా కాలనీవాసులు నీటి సమస్యను పరిష్కరించాలని రోడ్డుపైకి వచ్చి ధర్నాలు, నిరసనలు కూడా చేపట్టారు. కార్పొరేషన్ పరిధిలోని చాలా ప్రాంతాల్లో వారంలో ఒక్కసారి నల్లా నీళ్లు సరఫరా చేస్తుండగా, అవి కూడా 30 నిమిషాలకు మించి రావడం లేదని, కొ న్ని ప్రాంతాలకు అసలు నీరే వదలడం లేదని, దీంతో ట్యాంకర్ నీటిని కొనుక్కోవాల్సిన పరిస్థితులు వచ్చాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేషన్ పరిధిలోనే జలాశయం..

కార్పొరేషన్ పరిధిలో 200 వరకు కాలనీలు ఉండగా సుమారు 1.50 లక్షల మంది జనాభా ఉన్నట్లు అంచనా. ప్రస్తుతం 33,280 పైగా నివాసగృహాలు ఉన్నాయి.అయితే ప్రజల అవసరాలకు సరిపడా నీరు మాత్రం రావడం లేదు. కార్పొరేషన్ పరిధిలోనే హిమాయత్‌సాగర్ జలాశయం ఉన్నప్పటికీ ఇక్కడి ప్రజలకు ఉపయోగం లేకుండా పోతున్నది. ఈ నీటిని ఇక్కడే వినియోగించుకునేందుకు నాయకులు, అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి హిమాయత్‌సాగర్ జలాశయం నుంచి కార్పొరేషన్‌కు మంచినీటిని సరఫరా చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


చెరువు కట్ట కింద బోర్లు వేసి ఇష్టానుసారంగా భూగర్భ జలాలు తోడేస్తున్న దృశ్యం

వాటర్ ట్యాంకర్లకు డిమాండ్..

కార్పొరేషన్ పరిధిలో నీరు అడుగంటుతుండడంతో నీటికి డిమాండ్ బాగా పెరిగింది. దీంతో కొందరు ప్రైవేట్ వ్యక్తులు హిమాయత్‌సాగర్ చెరువు కట్ట కింది ప్రాంతాల్లో వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ ఇష్టానుసారంగా బోర్లేసి భూగర్భ జలాలను తోడేస్తూ ట్యాంకర్లతో నీటిని అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. 5 వేల లీటర్ల ప్రైవేట్ నీటి ట్యాంకర్‌కు రూ. 900-1100 వరకు వసూలు చేస్తున్నారు. అదీ కూడా రెండురోజుల ముందే ట్యాంకర్ కావాలని కోరితే వచ్చేపరిస్థితి నెలకొంది.

నీరు సరిపోకపోవడంతో..

గృహాలు, అపార్ట్‌మెంట్లలో బోర్లు వట్టిపోవడంతో మళ్లీ వేసే పరిస్థితి లేదు. ఇంటి ఆవరణలో వేయాల్సిన బోర్లు ఏకంగా రోడ్ల పక్కన, పుట్‌పాత్‌లపైనే ఒకరిని చూసి మరొకరు బోర్లు వేస్తున్నారు. నిబంధనల ప్రకారం కొత్తగా బోరు వేయాలంటే దానికి 100 మీటర్ల దూరం వరకు ఎలాంటి బోరు ఉండకూడదు. అక్కడ నీరు పడుతుందని భూగర్భ జల శాఖ వారు ఇచ్చే ధ్రువీకరణ పత్రంతో రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వారు పరిశీలించిన తర్వాతే అనుమతులు జారీ చేస్తారు. అయినా దీనిపై అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అడుగంటిన కుంటలు, చెరువులు..

గత వర్షాకాలంలో కార్పొరేషన్ పరిధిలోని పీరం చెరువు, హైదర్షాకోట్‌లోని ఎర్రకుంట, కిస్మత్‌పూర్ ఎర్రకుంట తదితర చెరువులు, కుంటల్లో పూర్తిస్థాయి నీటి మట్టం చేరలేదు. దీంతో అవి కూడా త్వరగానే అడుగంటడంతో చుట్టుపక్కలా ఇండ్లలోని బోర్లు పనిచేయడం లేదు. చెరువుల్లో నీరు నిల్వ ఉంటే బోర్లలో వాటర్ పుష్కలంగా ఉంటుందని కాలనీవాసులు పేర్కొంటున్నారు.

మిషన్ భగీరథ పథకం ద్వారా 50 కోట్ల నిధులు..

గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా కార్పొరేషన్ పరిధిలో రూ. 50 కోట్ల నిధులతో ఎర్రకుంట తండా, కిస్మత్‌పూర్ ప్రభుత్వ పాఠశాల, బైరాగిగూడ వద్ద ట్యాంకులు నిర్మించి పైపులైన్ ద్వారా 12.8 ఎంఎల్‌డీల నీటిని సరఫరా చేస్తున్నారు.అయితే ఇప్పుడు ప్రజలకు సరిపడా నీటిని మాత్రం పెంచడం లేదు. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా జలమండలి అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రతిఒక్కరూ ధర్మాన్ని ఆచరించాలి

శ్రీ వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందస్వామి

- సనాతన వేదాంత జ్ఞానసభలు ప్రారంభం
- వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన పీఠాధిపతులు


సభలో ప్రసంగిస్తున్న వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందస్వామి

బడంగ్‌పేట్: మానవులు ధర్మబద్ధులుగా మెలగాలని, ధర్మాన్ని కాపాడితే అది మనల్ని కాపాడుతుందని శ్రీవ్యాసాశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీ పరిపూర్ణానంద స్వామి బోధించారు. జనన, మరణాలు లేని పరబ్రహ్మాన్ని తెలుసుకోవడమే సనాతన ధర్మమని తెలిపారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ ఎస్వీఆర్ గార్డెన్‌లో 98వ సనాతన వేదాంత జ్ఞానసభలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పరిపూర్ణానందస్వామి మాట్లాడుతూ.. ధర్మక్షేత్రే.. కురుక్షేత్రే అనే పదాలతో గీత ప్రారంభమైందని, ప్రతిఒక్కరూ ధర్మాన్ని ఆచరించాలని కోరారు. తల్లిదండ్రులు, గురువు, భగవంతుడి సేవలో తరించాలన్నారు. యజ్ఞాలు, దాన ధర్మాలు మానవుల విధి అని, అందరూ తప్పక ఆచరించాలని సూచించారు. సభలో భగవద్గీత ఆరు అధ్యాయాలు పారాయణం చేశారు. వాటి సారాంశాన్ని భక్తులకు వివరించారు. అనంతరం పలువురు పీఠాధిపతులు ఉపన్యసించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పీఠాధిపతులు, మఠాధిపతులు ఆధ్యాత్మిక వేడుకలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం కుబేర యజ్ఞం చేశారు. అనంతరం శ్రీనివాస్, సుప్రియ దంపతులు శివ పార్వతుల కల్యాణం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన మాజీ డీజీపీ అరవింద్‌రావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ పరమాత్మానందగిరి స్వామి, శ్రీ శుద్ధ చైతన్యానందగిరి స్వామి, అసంగానందగిరి స్వామి, విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు డా.కసిరెడ్డి వెంకటరెడ్డి, కవయిత్రి బొప్పన అరుణాదేవి, ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు లక్ష్మణ్‌గుప్తా, కన్వీనర్ పాండు గుప్తా, మీడియా కన్వీనర్ కె.వెంకటేశ్ పాల్గొన్నారు.


శివపార్వతుల కల్యాణం